

### టీడీపీ హయాంలో..

అంతకముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యానశాఖకు ఎంతో ప్రాధాన్యం ఉండేది. ఉద్యాన పంటలు సాగుచేసే గిరిజన రైతులకు ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించేవారు. దీనివల్ల అత్యధికులు ఆ పంటల సాగుపై ఆసక్తి చూపేవారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జీడి, మామిడి, జామ, కొబ్బరి, సీతాఫలం, నిమ్మ తదితర మొక్కలను గిరిజన రైతులకు పంపిణీ చేసి.. సంరక్షణ బాధ్యతలు చూసేవారు. ఉపాధి హామీ కింద మూడేళ్ల పాటు వాటి నిర్వహణ బాధ్యతలను గిరిజనులకు అప్పగించేవారు. మొక్క బతికే వారు ఎంతోకొంత చెల్లించే వారు. మొక్కల చుట్టూ కంచెల ఏర్పాటు కూడా డబ్బులు చెల్లించేవారు. దీంతో గిరిజనులు ఎంతో శ్రద్ధతో మొక్కల పెంపకం చేపట్టేవారు. తాజాగా టీడీపీ కూటమి ప్రభుత్వం ఉద్యాన శాఖపై దృష్టిసారించడంతో జిల్లాలో గిరిజన రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మళ్లీ తమకు మంచిరోజులు వచ్చాయని భావిస్తున్నారు.

# ఉద్యాన శాఖకు ఊతం

- దృష్టి సారించిన టీడీపీ కూటమి ప్రభుత్వం
- గిరిజన రైతులకు అండగా చర్యలు
- మొక్కల పంపిణీకి రంగం సిద్ధం
- వైసీపీ హయాంలో నిర్వీర్యమైన ఉద్యానశాఖ
- సాగుకు దూరమైన ఏజెన్సీవాసులు
- నూతన సర్కారు ఆదేశాలతో చిగురిస్తున్న ఆశలు

పార్వతీపురం, జూన్ 22 (ఆంధ్రజ్యోతి)

టీడీపీ కూటమి ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా గిరిజన రైతులకు మెరుగైన సేవలు అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఉపాధి నిధులను ఉద్యాన శాఖకు మళ్లించి పర్యావరణాన్ని పెంపొందించాలని, గిరిజన రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని ఇటీవల డిప్యూటీ సీఎం, మంత్రి పవన్‌కల్యాణ్ అధికారులకు సూచించారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఈ అంశానికి సంబంధించిన ఫైల్‌పై ఆయన రెండో సంతకం చేశారు. దీనిలో భాగంగా క్షేత్రస్థాయిలో అధికారులు సన్నద్ధమయ్యారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో నాలుగు లక్షల మొక్కల పంపిణీకి రంగం సిద్ధం చేస్తున్నారు. దీర్ఘకాలికంగా ఉన్న జీడి చెట్లను తొలగించి వాటి స్థానంలో అంట్లను సరఫరా చేయడానికి సన్నద్ధమవుతున్నారు. మొత్తంగా కూటమి ప్రభుత్వ పాలనలో ఐటీడీఏలో ఉద్యాన శాఖకు పూర్వ వైభవం వచ్చిందని చెప్పొచ్చు.

### గత వైసీపీ సర్కారు పాలనలో..

గత వైసీపీ సర్కారు పాలనలో ఐటీడీఏల్లో ఉద్యాన శాఖ నిర్వీర్యమైంది. అసలు జిల్లాలో ఆ శాఖ ఉందా? అన్న సందేహం ప్రజల్లో ఉండేది. వైసీపీ సర్కారు పూర్తిగా నిధులు కేటాయించకపోవడంతో ఐదేళ్లుగా ఆ శాఖాధికారులు ఎటుంటి కార్యక్రమాలు చేపట్టలేకపోయారు. గత ఐదేళ్లలో మొక్కల పంపిణీ, గిరిజన రైతులతో సమావేశాలు నిర్వహించలేదు. జీడి, మామిడి, ఇతరత్రా అంతర పంటల సాగుపై అవగాహన కూడా కల్పించలేదు. తూతూ మంత్రంగా చిన్న చిన్న కార్యక్రమాలు తప్ప ఆ శాఖ ద్వారా ఏమీ జరగలేదని చెప్పవచ్చు. పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో ఉద్యానశాఖ ద్వారా ఎటువంటి కార్యక్రమాలు లేకపోవడంతో సంబంధిత కార్యాలయాలకు పరిమితం అవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

● జిల్లాలోని సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏల పరిధిలో వేలాది ఎకరాల్లో జీడి పంట సాగవుతోంది. కానీ ఏటా తెగుళ్లు, ప్రకృతి వైపరీత్యాల వల్ల జీడి రైతులు ఆశించిన స్థాయిలో దిగుబడి పొందలేక తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో గిరిజన రైతులను ఆర్థికంగా ఆదుకోవాల్సి ఉన్నా.. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు చర్యలు తీసుకోలేదు. ఉద్యాన శాఖ ద్వారా కూడా ఎటువంటి భరోసా అందించలేదు. జిల్లా ఏర్పడిన తర్వాత జీడి రైతులకు ఏర్పడిన నష్టాన్ని సర్వే బృందం అధికారులు పరిశీలించి వెళ్లారు తప్ప ఇంతవరకు పరిహారాన్ని అందించలేదు. రెండు ఐటీడీఏల పరిధిలో సుమారు 50 వేలకు పైబడి ఎకరాల్లో జీడిసాగు జరుగుతున్నా.. గిరిజన రైతుల కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలేవీ నిర్వహించడం లేదు. వారికి అవసరమైన సహాయ సహకారాలను అందించడం లేదు.



సీతంపేట ఐటీడీఏ



పార్వతీపురం ఐటీడీఏ





### పెట్టుబడి ఖర్చులు తగ్గే అవకాశం..

వాస్తవంగా ఉపాధి హామీని వ్యవసాయంతో అనుసంధానం చేయాలని ఎప్పటినుంచో డిమాండ్ ఉంది. కానీ ఆ దిశగా కార్యాచరణ జరగలేదు. నూతనంగా అధికారం చేపట్టిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ దశగా అడుగులు వేసింది. వివిధ రకాల పండ్ల తోటలు, కూరగాయల పంటలన్నీ ఉద్యాన పంటల కోవకే వస్తాయి. ఆయిల్‌పామ్, అరటి వంటి పంటలు జిల్లాలో విస్తారంగా ఉన్నాయి. మామిడి, జీడి పంటలకు కొదవే లేదు. ఉద్యాన పంటలతో ఉపాధి పథకాన్ని అనుసంధానం చేస్తున్న కారణంగా ఇటు వేతనదారులు ఏడాది పొడవునా పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. మరోవైపు సంబంధిత భూ యజమాని రైతు కూడా క్షేత్రంలోనే ఉంటాడు. పని ఎంత జరిగిందనేది స్పష్టంగా కన్పిస్తుంటుంది. శ్రమ శక్తిని ఉపయోగకరమైన మార్గంలో నడిపించడం ద్వారా రైతుల పెట్టుబడి ఖర్చులు తగ్గే అవకాశం ఉంది. మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# జడ్పీకి నిధుల కొరత

- గత సర్కారు తీరుతో ఆదాయం లేక అచేతన స్థితికి..
- మండల పరిషత్‌లదీ అదే తీరు
- ఉత్సవ విగ్రహాలుగా ఎంపీటీసీలు, జడ్పీటీసీలు
- కొత్త ప్రభుత్వంపైనే ఆశలు

(రాజాం/పార్వతీపురం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కానీ, పంచాయతీల నుంచి జిల్లా పరిషత్‌ల వరకూ అధికశాతం వైసీపీ ఆధీనంలో ఉన్నాయి. దీంతో ఎమ్మెల్యేలతో సమన్వయం ఉంటేనే నిధులు సర్దుబాటు అవుతాయి. పాలన సజావుగా జరుగుతుంది. గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే స్థానిక సంస్థలు వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధులు లేక అచేతన స్థితికి చేరాయి. ప్రజలకు మంచి చేయాలన్న లక్ష్యంతో ఎన్నికల్లో పోటీచేసి గెలిచిన ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలి పోయారు. వారికి కార్యాలయంలో కూర్చునేందుకు సీటు కూడా లేదు. కేవలం సర్వసభ్య సమావేశాలకే అన్నట్టు వారి పరిస్థితి తయారైంది. ప్రజలు, అధికారులతో కళకళలాడే మండల పరిషత్ కార్యాలయాలు సైతం దయనీయ స్థితిలో ఉన్నాయి. మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌ల బ్యాంక్ ఖాతాలు ఖాళీగా కనిపిస్తున్నాయి. పంచాయతీల పరిస్థితి అదే విధంగా ఉంది. దీంతో ప్రజలకు ఇచ్చిన హామీలు ఎలా నెరవేర్చాలా అంటూ వారు తలలు పట్టుకుంటున్నారు. 32 శాఖల పర్యవేక్షణతో, పుష్కలమైన నిధులతో తొణికిసలాడిన జిల్లా పరిషత్‌లు జగన్ పాలనలో తమ ప్రాభవాన్ని కోల్పోయాయి. ఎంపీలు, ఎమ్మెల్యేలు దయతలచితేనే నిధులు అన్నట్టు పరిస్థితి ఉంది. న్యాయబద్ధంగా జడ్పీకి రావాలసిన స్థానిక సంస్థల పన్నులు, గనులు, ఇసుక సీనరేజ్ చార్జీలు వంటివి ఏళ్ల తరబడి నిలిచిపోయాయి. ప్రజల్లోకి వెళ్లాలంటే భయం వేస్తోందని ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నిల్ బ్యాలెన్స్..

ఉమ్మడి జిల్లాలో పంచాయతీలకు 2021, మార్చిలో ఎన్నికలు జరిగాయి. తరువాత జడ్పీ చైర్మన్‌తో పాటు ఎంపీపీలు ఎన్నికయ్యారు. అయితే కొన్ని మండలాల్లో ఎంపీపీలు, జడ్పీటీసీలు కూర్చునేందుకు కనీసం చాంబర్లు లేవు. పాత భవనాల్లో అధికారులు, సిబ్బంది విధుల నిర్వహణకే కష్టంగా ఉంది. దీంతో ఏదో మూలన ఒక కుర్చీ వారి కోసం కేటాయిస్తున్నారు. జడ్పీ, మండల పరిషత్‌ల్లో ఆశించిన స్థాయిలో నిధులు లేవు. కొన్ని మండలాల్లో అయితే బ్యాంక్ అకౌంట్లలో నిల్ బ్యాలెన్స్ చూపిస్తోంది. 2018లో పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగియగా, 2019 జూన్‌తో ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం ముగిసింది. అయితే ఎన్నికలు సకాలంలో జరగలేదు. పంచాయతీలు, మండలాలు, జిల్లా పరిషత్‌లకు ప్రత్యేకాధికారుల పాలన ఏళ్ల తరబడి కొనసాగింది. దీంతో స్థానిక సంస్థలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి. 14, 15 ఆర్థిక సంఘం నిధులు సైతం సరిగ్గా ఖర్చు కాలేదు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకుగాను ఏటా జనాభా ప్రాతిపదికన ఆర్థిక సంఘం నిధులు విడుదలవుతాయి. పాలక వర్గాలు లేకపోవడంతో 14వ ఆర్థిక సంఘం నిధులు సరిగ్గా ఖర్చుకాలేదు. తరువాత ఎన్నికైన సర్పంచ్‌లకు తెలియకుండా గత ప్రభుత్వం విద్యుత్ బిల్లుల పేరిట ఆర్థిక సంఘం నిధులను మళ్లించింది. దీంతో కొన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్మికులకు కూడా వేతనాలు చెల్లించలేని స్థితిలో పంచాయతీలు ఉన్నాయి.



### ఆదాయం లేకుండా చేసిన వైసీపీ సర్కారు..

జిల్లా పరిషత్ అంటే గతంలో ఎంతో గౌరవం ఉండేది. నిధులు, విధుల్లో జడ్పీ స్వతంత్రంగా వ్యవహరించేది. 32 శాఖలకు సంబంధించి పర్యవేక్షణ జడ్పీదే. విద్యాశాఖ పదోన్నతులు, బదిలీలు కూడా జడ్పీ పరిధిలోనే జరిగేవి. విచక్షణాధికారాలు సైతం ఉండేవి. కానీ, రానురాను ప్రభుత్వాలు ఆ అధికారాలకు కత్తెర వేశాయి. కీలక అధికారాలను హస్తగతం చేసుకున్నాయి. గతంలో ఇసుక, గనుల సీనరేజ్ అంతా జడ్పీ పరిధిలోనే ఉండేవి. ఇసుక రీచ్‌ల నిర్వహణ కూడా ఉండేది. కానీ, గత వైసీపీ ప్రభుత్వానికి ఆదాయ వనరుగా మారడంతో హస్తగతం చేసుకుంది. గతంలో సీనరేజ్ రూపంలో వచ్చే ఆదాయాన్ని పంచాయతీలు 50 శాతం, జిల్లా పరిషత్, మండల పరిషత్‌లు చెరో 50 శాతం పంచుకునేవి. అయితే, ఈ ఆదాయాన్ని గత సర్కారు తీసుకుని స్థానిక సంస్థలకు మొండిచేయి చూపింది. అదే విధంగా రిజిస్ట్రేషన్ సర్‌చార్జీలు, నీటి తీరువా పన్నుల్లో కొంత మొత్తం స్థానిక సంస్థలకు ఆదాయం వచ్చేది. ఎకరాకు నీటి తరువా రూ.200 వసూలు చేస్తే అందులో 5 నుంచి 10 శాతం పంచాయతీలకు జమ అయ్యేది. పంచాయతీ పరిధిలో ఎవరైనా భూములు విక్రయించి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టయితే రిజిస్ట్రేషన్ శాఖ నుంచి సర్ చార్జీల రూపంలో కొంత మొత్తం పంచాయతీలకు వచ్చేది. కానీ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో ఆదాయం లేక ఎమ్మెల్యేలు, ఎంపీల నిధులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జిల్లా పరిషత్, స్థానిక సంస్థలకు పూర్వ వైభవం వస్తుందని జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



విజయనగరంలో జిల్లా పరిషత్ కార్యాలయం

### వలంటీర్ల వేతనాలకు చర్యలు

**గరుగుబిల్లి, జూన్ 22 :** జిల్లాలోని పలు గ్రామాల్లో రాజీనామాలు చేయని వలంటీర్లకు వేతనాలు అందించాలని శనివారం ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. నిధి /పీఎఫ్‌పై ఆఈఎల్ఎల్ హెచ్‌సీఆర్‌డీ పీవోఆర్‌టీఎఎల్‌లో వలంటీర్ల వివరాలు పొందుపర్చాలని ఎంపీడీవోలు సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. వాస్తవంగా జిల్లాలో 5,680 మంది వలంటీర్లను గత వైసీపీ ప్రభుత్వం నియమించింది. సార్వత్రిక ఎన్నికల సమ యంలో రాజీనామాలు చేసి ప్రచారంలో పాల్గొవాలని వారిపై ఆ పార్టీ ప్రతి నిధులు తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చారు. దీంతో పలు మండలాల్లో 2,686 మందికి పైగా వలంటీర్లు రాజీనామా పత్రాలను అందించారు. అయితే టీడీపీ అధినేత చంద్ర బాబు హామీని నమ్మిన సుమారు 3 వేల మంది రాజీనామాలు చేయలేదు. ప్రస్తుతం వారందరికీ జీతాలు అందనున్నాయి.

### 4 వరకు సీతంపేట ఐటీడీఏ పీవో సెలవు

- ఇన్‌చార్జిగా పార్వతీపురం పీవో

**సీతంపేట:** సీతంపేట ఐటీడీఏ పీవో శుభంబన్సాల్ వచ్చేనెల నాలుగో తేదీ వరకు సెలవు పెట్టినట్లు సంబంధిత అధికార వర్గాలు స్పష్టం చేశాయి. ఈనెల 9 నుంచి పీవో సెలవుపై వెళ్లారు. అయితే మధ్యలో వచ్చి ఆయన విధులు నిర్వ హిస్తారని అధికారులు చెప్పుకొచ్చారు. అయితే వ్యక్తిగత కారణాల వల్ల పీవో తన సెలవును పొడిగించినట్టు తెలిసింది. కాగా పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే ఐటీడీఏ ఏపీవో రోసిరెడ్డి పదవీ విరమణ చేయగా ఆ బాధ్యతలను ఉద్యాన శాఖాధికారి గణేష్‌కు అప్పగించారు. ఈ నెల 24న ఐటీడీఏ గ్రీవెన్స్ నిర్వహించాలని, దానికి అనుగుణంగా అధికారులు సిద్ధం కావాలని నూతన ప్రభుత్వం ఆదేశించింది. అయితే ప్రధాన అధికారులు లేకపోవడంతో గ్రీవెన్స్ నిర్వహణపై సందిగ్ధం నెలకొంది.

### 27న గురుకులాల్లో సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష

**సాలూరు రూరల్, జూన్ 22:** పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో ఉన్న అంబేడ్కర్ గురుకులాల్లో 6,7,8,9 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఈ నెల 27న ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి జిల్లాల కో ఆర్డినేటర్ పద్మజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 25 నాటికి ఆ పాఠశాలలకే దరఖాస్తు అందించాలని పేర్కొన్నారు. దరఖాస్తు ఇచ్చిన పాఠశాలలో ఈ నెల 27న ప్రవేశపరీక్ష రాయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా ఖాళీ సీట్లును భర్తీ చేస్తామన్నారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో...

| తరగతి | బొడ్డవలస | కొమరాడ | గరుగుబిల్లి | పార్వతీపురం |
|---|---|---|---|---|
| ఆరు | 41 | 29 | 14 | 40 |
| ఏడు | 22 | 21 | 4 | 18 |
| ఎనిమిది | 10 | 13 | 2 | 13 |
| తొమ్మిది | 12 | 15 | 4 | 16 |

# ఆయుష్‌పై అలసత్వం

- ఆయా ఆసుపత్రులపై దృష్టి సారించని గత వైసీపీ ప్రభుత్వం
- వైద్యుల నియామకంపై నిర్లక్ష్యం
- సిబ్బంది లేక మూతపడుతున్న కేంద్రాలు
- కొన్నిచోట్ల చెదలు పడుతున్న వైనం
- హోమియో, ఆయుర్వేద వైద్యానికి దూరమైన ప్రజలు

(గరుగుబిల్లి)

కేంద్ర ప్రభుత్వం ఆయుష్ వైద్యానికి అత్యంత ప్రాధాన్యమిచ్చినా గత వైసీపీ ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. గత ఐదేళ్లలో ఆయా ఆసుపత్రులకు ఆయుష్షు లేకుండా చేసింది. వైద్యులు, సిబ్బంది నియామకంలో అలసత్వం వహించడంతో చాలావరకు కేంద్రాలు మూతపడ్డాయి. దీంతో హోమియో, ఆయుర్వేద వైద్యానికి ప్రజలు దూరమయ్యారు. దీర్ఘకాలిక రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ఆయుష్ కేంద్రాల నిర్వహణపై దృష్టి సారించలేదు. మొత్తంగా గత ప్రభుత్వ నిర్వాకంతో అధికంగా హోమియో వైద్యశాలలకు చెదలు పడుతున్నాయి.

### ఇదీ పరిస్థితి..

ఉమ్మడి జిల్లాలో 16 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం ఎనిమిది మందే విధులు నిర్వహిస్తున్నారు. పూర్తిస్థాయిలో అవసరమైన మందులు, సామగ్రి ఉన్నా.. వైద్యులు లేక, కేంద్రాలు మూతపడడంతో రోగులకు ఆ సేవలు అందడం లేదు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో గరుగుబిల్లి, గజపతినగరం, వేపాడ మండలం బల్లంకి, గరివిడి, సతవాడ, శివడవలసతో పాటు పలు మండలాల్లో వైద్యులను నియమించాల్సి ఉంది. దీనిపై గత వైసీపీ సర్కారు శ్రద్ధ చూపలేదు. దీంతో రెండేళ్లుగా ఎటువంటి నియామకాలు లేవు. డిప్యుటేషన్లు రద్దవడంతో విధులు నిర్వహిస్తున్న వారిని వేరే ప్రాంతాలకు పంపించలేని పరిస్థితి. అయితే హోమియో వైద్యులు లేకపోవడంతో అధికంగా రోగులు ప్రైవేట్ డాక్టర్లనే ఆశ్రయిస్తున్నారు. ఇకపోతే కొన్నాళ్లుగా పారా మెడికల్ సిబ్బంది రిక్రూట్‌మెంట్ కూడా జరగడం లేదు. వైద్యుల నియా మకం అంశం ఉన్నత న్యాయస్థానంలో ఉండడంతో పూర్తిస్థాయిలో పోస్టుల భర్తీ జరగడం లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో హోమియో, ఆయుర్వేద శాఖల్లో సమస్య ఏర్పడింది.

● గతంలో గరుగుబిల్లిలో వైద్యాధికారిగా విధులు నిర్వహించిన డాక్టర్ పి.శ్రీనివాసరావును మేడపల్లికి బదిలీ చేశారు. అయితే సుమారు రెండేళ్లు గడుస్తున్నా.. ఆ స్థానంలో ఎవర్నీ నియమించలేదు. ప్రస్తుతం పార్వతీ పురంలో డాక్టర్ బి.సుశీల విధులు నిర్వహిస్తున్నారు. ఆమె శివడవలసలో కొన్నాళ్లుగా ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. గరుగుబిల్లిలో వారానికి రెండు రోజులైనా విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. దీనిపై నూతన ప్రభుత్వం దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని 'ఆయుష్'కు ఊపిరి పోయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.




గరుగుబిల్లి లో ఆయుష్ వైద్యశాల ఇలా..

### ఉన్నతాధికారులకు నివేదించాం..

ఉమ్మడి జిల్లా పరిధిలో ఆయుష్ ఆసుపత్రుల పరిస్థితులపై ఉన్నతాధికారులకు నివేదించాం. మన్యంలో అధికంగా వైద్యుల పోస్టుల ఖాళీలు ఉన్నాయి. వారి నియామకం అంశం న్యాయస్థానంలో ఉంది. వేరే ప్రాంతం నుంచి బదిలీలకు ప్రస్తుతం ఆస్కారం లేదు. ప్రజల నుంచి ఒత్తిడి ఉంది. పారా మెడికల్ సిబ్బంది నియామకం కూడా జరగలేదు. జిల్లా కేంద్రంలోనే పూర్తిస్థాయిలో మందులున్నాయి. నూతన ప్రభుత్వం ఆయూష్‌కు తగిన ప్రాధాన్యం ఇస్తే పూర్వ వైభవానికి చర్యలు చేపడతాం.

\- బట్టు వరప్రసాద్, ఉమ్మడి జిల్లా ఆయుష్ వైద్యాధికారి

### వైభవంగా జగన్నాథుని నేత్రోత్సవం

**జియ్యమ్మవలస/భామిని, జూన్ 22 :** జియ్యమ్మవలస మండలం చిన మేరంగి గ్రామంలో శనివారం వైభవంగా జగన్నాథస్వామి నేత్రోత్సవం నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి జ్యేష్టాభిషేకం, వార్షిక స్నానం, పూజాది కార్యక్ర మాలు జరిపారు. పరిసర ప్రాంత భక్తులు జగన్నాథుడిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పౌర్ణమి సందర్భంగా.. సంప్రదాయం ప్రకారం బల భద్ర, సుభద్ర, జగన్నాథస్వామి ఉత్సవ మూర్తులకు పవిత్ర జలాలతో దర్పన స్నానం చేసి నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఎస్.గిరిధరపాత్రో తెలిపారు. భామిని మండలం బత్తిలిలోని జగన్నాథస్వామి ఆలయంలో జగన్నాథ, బలభ ద్ర, సుభద్ర ఉత్సవమూర్తులకు దేవస్నానాలు చేశారు. వేతమంత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్కళ సంప్రదాయం ప్రకారం చీకటి గదిలోకి విగ్రహాలను తరలించారు. 15 రోజుల తర్వాత మళ్లీ గదిని తెరిచి విగ్రహాలను బయటకు తెచ్చి.. విశేష పూజలు చేయనున్నామని ఆలయ అర్చకులు ప్రతాప్‌సాహు తెలిపారు.



పూజలందుకున్న ఉత్సవ విగ్రహాలు

# దిక్సూచి
DIKSUCHI

## ఏఎన్‌యూలో దూరవిద్య కోర్సులు



గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ(ఏఎన్‌యూ) దూరవిద్య విభాగం- వివిధ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. డిగ్రీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఈ కోర్సులను ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానంలో నిర్వహిస్తారు.

**డిగ్రీ:** బీఏ, బీకాం, బీబీఏ ప్రోగ్రామ్‌ల వ్యవధి మూడేళ్లు. బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది.

**బీఏ సబ్జెక్టులు:** ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, హిస్టరీ, స్పెషల్ ఇంగ్లీష్, స్పెషల్ తెలుగు, బ్యాంకింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్.

**బీకాం సబ్జెక్టులు:** జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్

- బీబీఏ, బీఎల్ఐఎస్సీ, బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్) కోర్సులను ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. బీఏ(ఎకనామిక్స్, బ్యాంకింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్), బీకాం(జనరల్) కోర్సులను తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో చదువుకోవచ్చు. మిగిలిన బీఏ కోర్సులు తెలుగు మాధ్యమంలో మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

**అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/పాలిటెక్నిక్ డిప్లొమా/రెండేళ్ల ఐటీఐ/ఇంటర్ ఒకేషనల్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బీఎల్ఐఎస్సీ కోర్సుకు మాత్రం ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

**పీజీ:** ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ కోర్సుల వ్యవధి రెండేళ్లు. మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది.

**ఎంఏ స్పెషలైజేషన్‌లు:** ఇంగ్లీష్, తెలుగు, హిందీ, సంస్కృతం, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, సోషల్ వర్క్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్.

**ఎంకాం స్పెషలైజేషన్‌లు:** అకౌంటెన్సీ, బ్యాంకింగ్

- ఎంఏ కోర్సుల్లో లాంగ్వేజ్ స్పెషలైజేషన్‌లను ఆ మాధ్యమంలోనే చదవాలి. ఎంఏ(ఎకనామిక్స్/హిస్టరీ/పొలిటికల్ సైన్స్/సోషియాలజీ) కోర్సులు తెలుగు మాధ్యమంలో ఉన్నాయి. మిగిలిన కోర్సులను ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాలి.

**అర్హత:** ఎంఏ, ఎంఎస్‌డబ్ల్యూ కోర్సులకు ఏదేని డిగ్రీ; ఎంఏ(ఎకనామిక్స్)కు బీఏ(ఎకనామిక్స్); ఎంకాం కోర్సుకు బీకాం/బీబీఏ; ఎంఎల్ఐఎస్సీ కోర్సుకు బీఎల్ఐఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంఏలో లాంగ్వేజ్ స్పెషలైజేషన్‌లకు ఆ లాంగ్వేజ్‌లు ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి.

**డిప్లొమా:** ఈ కోర్సుల్లో ఫుడ్ ప్రొడక్షన్, సైకలాజికల్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. ఫుడ్ ప్రొడక్షన్ కోర్సుకు పదోతరగతి ఉత్తీర్ణులు, సైకలాజికల్ గైడెన్స్ కోర్సుకు ఇంటర్/పన్నెండోతరగతి/పాలిటెక్నిక్ డిప్లొమా/రెండేళ్ల ఐటీఐ పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

**సర్టిఫికెట్ కోర్సులు:** హోటల్ అండ్ హాస్పిటల్ హౌస్ కీపింగ్, హెచ్ఐవీ ఎయిడ్స్ కౌన్సెలింగ్ కోర్సులు ఉన్నాయి. కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాలి. హౌస్ కీపింగ్ కోర్సుకు పదోతరగతి ఉత్తీర్ణులు, ఎయిడ్స్ కౌన్సెలింగ్‌కు ఇంటర్(పారామెడికల్)తోపాటు ఏదేని డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

**ముఖ్య సమాచారం**

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** www.anucde.info

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/MQRZNeDలో చదవండి.

## విశాఖ ఐఐపీఈలో బీటెక్

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ)- బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. జేఈఈ(అడ్వాన్స్‌డ్) 2024 స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ప్రోగ్రామ్ తోపాటు డిప్లొమా ఇన్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తిచేసి క్యాట్ స్కోర్ లేకుండానే ఐఐఎం విశాఖపట్నంలో ఎంబీఏ చదివే వీలుంది.

**విభాగాలు-సీట్లు:** పెట్రోలియం ఇంజనీరింగ్‌లో 62 సీట్లు, కెమికల్ ఇంజనీరింగ్‌లో 63 సీట్లు, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 40 సీట్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

**అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా కనీసం 75 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 65 శాతం మార్కులు చాలు. అభ్యర్థులందరికీ జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024 అర్హత తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 5
- **అకడమిక్ సెషన్ ప్రారంభం:** ఆగస్టు 5 నుంచి
- **వెబ్‌సైట్:** iipe.ac.in

## ఓయూలో లేటరల్ ఎంట్రీ

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన 'యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్- బీఈ/బీటెక్ ప్రోగ్రామ్‌లలో లేటరల్ ఎంట్రీకి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. 'కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీప్)' కింద నిర్వహిస్తున్న ఈ ప్రోగ్రామ్‌లను డిప్లొమా పూర్తిచేసిన వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేకించారు. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా ఎంపిక చేసిన అభ్యర్థులకు బీఈ/బీటెక్ రెండో ఏడాది ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

**స్పెషలైజేషన్‌లు-సీట్లు:** సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 30 సీట్లు చొప్పున మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

**ప్రోగ్రామ్ వివరాలు:** ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. సాయంత్రం సమయాల్లో ఆరు నుంచి తొమ్మిదిన్నర వరకు తరగతులు నిర్వహిస్తారు. సెమిస్టర్‌కు ట్యూషన్ ఫీజు రూ.50,000.

**అర్హత:** తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ లేదా గుర్తింపు పొందిన బోర్డు నుంచి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. ఏఐ&ఎంఎల్ స్పెషలైజేషన్‌కు ఏ విభాగంవారైనా అప్లయ్ చేసుకోవచ్చు. సీఎస్ఈ/ఏఐ/ఏఐడీ/ఏఐఎం /సీఎంఈ/సీఎస్‌బీ/సీఎస్‌సీ/సీఎస్‌డీ/సీఎస్‌జీ/సీఎస్ఐ/సీఎస్ఎం/సీఎస్ఎన్/సీఎస్ఓ/సీఎస్‌టీ/సీఎస్‌డబ్ల్యూ/సీఐసీ అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తారు. జనరల్ అభ్యర్థులకు కనీసం 45 శాతం, రిజర్వ్‌డ్ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. అభ్యర్థులందరికీ కనీసం ఏడాది ఫుల్ టైమ్ ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 11
- **ఎంట్రెన్స్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 18
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూలై 21
- **మొదటి ఫేజ్ కౌన్సెలింగ్:** జూలై 27
- **రెండో ఫేజ్ కౌన్సెలింగ్:** ఆగస్టు 3
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in

# నవ్య | చిత్రజ్యోతి

## విజువల్‌గా.. మ్యూజికల్‌గా...



నాగచైతన్య, సాయి పల్లవి జంటగా రూపుదిద్దుకుంటున్న 'తండేల్' చిత్రం వైజాగ్, శ్రీకాకుళం షెడ్యూల్ శనివారంతో పూర్తయింది. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకుడు. ఈ షెడ్యూల్‌లో హీరోహీరోయిన్లతో పాటు ఇతర నటీనటులు పాల్గొనగా కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. పాత్రల గెటప్, కాస్ట్యూమ్స్, బాడీ లాంగ్వేజ్, యాస ప్రామాణికంగా ఉండేలా దర్శకుడు చందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వాస్తవ సంఘటనల ప్రేరణతో ఓ ప్రేమ కథగా 'తండేల్' ను భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. విజువల్‌గా, మ్యూజికల్‌గా ఎంతో అద్భుతంగా ఉండేలా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, సినిమాటోగ్రఫీ: షామ్‌దత్, ఎడిటింగ్: నవీన్ నూలి.

## రామానుజుల గొప్పతనం చెప్పే కథ



డా. సాయి వెంకట్ టైటిల్ రోల్‌లో నటించి.. దర్శకత్వం వహించిన సినిమా 'జయహో రామానుజ'. జో శర్మ, సుమన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సాయిప్రసన్న, ప్రవల్లిక నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా వస్తున్న ఈ సినిమా ఫస్ట్ పార్ట్ జూలై 12న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, సంస్కృత భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా 'జయహో రామానుజ' సినిమా పాటలను చిత్ర బృందం శనివారం విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు, హీరో సాయి వెంకట్ మాట్లాడుతూ 'మహిళల్ని గౌరవించాలని.. కుల మతాలకు అతీతంగా ఐకమత్యంతో మానవాళి కలసి ఉండాలని సందేశాన్ని ఇచ్చిన గొప్ప గురువు భగవత్ శ్రీ రామానుజాచార్యులు. ఆయన గొప్పదనం ఈ తరం వారికి తెలియాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని రూపొందించాను' అని చెప్పారు. నిర్మాత ప్రవల్లిక మాట్లాడుతూ 'భారీ స్థాయిలో అత్యున్నత సాంకేతిక విలువలతో నిర్మించిన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ప్రసన్నకుమార్, దర్శకుడు వీరశంకర్ పాల్గొన్నారు.

## ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ



హాస్య నటుడు అలీ ఫ్యామిలీ నుంచి వచ్చిన సదన్ హీరోగా, ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా నటించిన 'ప్రణయ గోదారి' చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. పి.ఎల్. విఘ్నేశ్ దర్శకత్వంలో పారమళ్ల లింగయ్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. గోదావరి అందాలు, నేచురల్ లొకేషన్స్‌లో చిత్రీకరించిన ఈ చిత్రంలోని 'కలలో .. కలలో' అంటూ సాగే గీతాన్ని సంగీత దర్శకుడు కోటి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ పాట చూస్తుంటే చక్కని అనుభూతి కలుగుతోంది. సాహిత్యం, సంగీతం, హీరోహీరోయిన్ల అభినయం చక్కగా కుదిరాయి. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే పాట అవుతుంది' అన్నారు. 'ఇది ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ. గోదారి అందాలు, అక్కడి ప్రజల జీవన విధానం అందంగా చూపించే ప్రయత్నం చేశాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో విడుదల చేస్తాం' అని తెలిపారు దర్శకనిర్మాతలు. సునీల్ రావినూతల, పృథ్వీ, సాయికుమార్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు.

## ప్రతిభావంతుడు ఎన్టీఆర్‌తో...



జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తుండగా, సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ ఇందులో కథానాయికగా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. 'దేవర పార్ట్ 1' సెప్టెంబర్ 27న విడుదలవుతోంది. ఈ సినిమాలోని ఓ పాటకు 'వార్', 'పఠాన్' సినిమాల ఫేమ్.. ప్రముఖ కొరియోగ్రాఫర్ బోస్కో మార్టిస్ నృత్యరీతుల్ని సమకూరుస్తున్నారు. థాయిలాండ్‌లో ప్రస్తుతం ఆ పాట షూటింగ్ జరుగుతోంది. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌తో తీసుకున్న ఫొటోను ఆయన షేర్ చేస్తూ- "అత్యద్భుతమైన ప్రతిభావంతుడు ఎన్టీఆర్‌తో పనిచేయడం ఎంతో ఆనందాన్నిస్తోంది" అని ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు.

## కల్కి ప్రత్యేక షో, టికెట్ ధరల పెంపునకు అనుమతి



ప్రభాస్ హీరోగా నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి 2898 ఏ.డీ' చిత్రం ప్రత్యేక ప్రదర్శన, టికెట్ ధరల పెంపునకు అనుమతినిస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈనెల 27వ తేదీన చిత్రం విడుదల కానుంది. జూలై 4వ తేదీ దాకా 8 రోజుల పాటు ప్రతీరోజూ ఐదు షోలు ప్రదర్శించటానికి అవకాశం ఇచ్చారు. విడుదల రోజు ఉదయం 5:30 గంటలకు ప్రత్యేక ప్రదర్శనకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఆ రోజు మొత్తం ఆరు షోలు ప్రదర్శించనున్నారు. ఇక టికెట్ ధరను జీఎస్టీతో కలిపి రూ.200లకు పెంచుకోవడానికి అనుమతించారు. సింగిల్ స్క్రీన్ థియేటర్‌లలో ప్రస్తుతం ఉన్న టికెట్ ధరపై రూ.75, మల్టీప్లెక్స్‌లలో రూ.100 అదనంగా పెంచుకోవడానికి అనుమతిస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జితేందర్ శనివారం మెమోనెం.23424/జనరల్.ఏ1/2024ను జారీ చేశారు.

\- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్

## లక్కు..నీ వెంట ...



'నా పేరు శివ', 'అంధగారం' వంటి చిత్రాల్లో నటించిన వినోద్ కిషన్ ప్రస్తుతం 'పేక మేడలు' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. అనూష కృష్ణ హీరోయిన్. నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రాకేశ్ వర్రే నిర్మిస్తున్నారు. ఈ సినిమా కోసం భార్గవ్ కార్తీక్ రాసిన 'లక్కు నీ వెంట కుక్క తోక లెక్క ఊపుకుంటూ వచ్చరో లచ్చన్న' అంటూ సాగే పాటను విడుదల చేశారు. నాగూర్ బాబు ఈ పాట పాడారు. స్మరణ్ సాయి సంగీత దర్శకుడు. ఈ సినిమాను జులైలో విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు.

# పర్యవేక్షణ లేదు.. పరిమితి లేదు

● భారీ వాహనాలతో దెబ్బతిన్న రోడ్లు ● చోద్యం చూస్తున్న అధికారులు

● ఇదీ ఎస్.కోట, జామి మండలాల్లో దుస్థితి



భీమసిగి నుంచి కొత్తవలస మార్గంలో దెబ్బతిన్న రోడ్డు

**శృంగవరపుకోట రూరల్/జామి:** భారీ, అనుమతికి మించి బరువుతో వాహనాల రాకపోకలపై రవాణాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎస్.కోట, జామి మండలాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. ప్రధానంగా ఇక్కడి రోడ్ల మీదుగా పరిమితికి మించి బరువుతో నిత్యం వందలాది వాహనాలు విశాఖ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. హైవే పనులు జరుగుతుండడంతో శృంగవరపుకోట, జామి మండలాల్లో వాటికి సంబంధించిన సామగ్రి పెద్ద మొత్తంలో తరలిస్తుండడంతో ప్రధాన రహదారులు ప్రమాదకరంగా మారాయి. దీంతో చీకటిపడిన తర్వాత రాకపోకలు సాగించే ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం అనుమతికి మించి లారీల్లో లోడ్లు తరలిస్తున్నారు. 16 టైర్లు గల లారీలో 40 నుంచి 45 టన్నులు సరుకు తరలించాల్సిఉండగా, 60 టన్నుల వరకూ తరలిస్తున్నారు. విశాఖపట్నం నుంచి బుగ్గి, తదితర ముడిసరుకులు లారీల్లో నిర్దిష్ట పరిమితిలో తీసుకు రావల్సి ఉంది. అయితే ఈ పరిమితికి మించి సామగ్రి తరలిస్తుండడంతో రోడ్లు వీటి బరువును తట్టుకోలేక దెబ్బతింటున్నాయి. ప్రధానంగా శృంగవరపుకోట నుంచి జామి మీదుగా విజయనగరం వెళ్లేమార్గం, భీమసింగి నుంచి కొత్తవలస వెళ్లే రహదారి పూర్తిగా పాడయ్యాయి. రవాణాశాఖ అధికారులు చోద్యం చూస్తుండడంతో లారీల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న, అధికబరువుతో లారీల్లో ముడిసరుకు తరలిస్తున్నా అధికారులు తనిఖీలు చేయ డంలేదన్న ఆరోపణ లొస్తున్నాయి. తమకు సరిపడా సిబ్బంది లేకపోవడం వల్లే దాడులు చేయలేకపోతున్నామని సిబ్బంది చెబుతున్నారు. అయితే ప్రజల సంక్షేమం కోసం వేసే రోడ్లు వివిధ సంస్థల సరకు రవాణాకు నిబంధనలకు విరుద్ధంగా వినియోగించడంతో దెబ్బతింటున్నాయని ప్రజా సంఘాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి.

## యూట్యూబ్‌లో చూసి.. పథకం పన్ని

● భార్యను హత్యచేసిన కేసులో సీఆర్పీఎఫ్ జవాన్ అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు

**గజపతినగరం:** యూట్యూబ్‌లో వీడియో చూసి,దాని ఆధారంగా ఓ పథకం పన్ని సీఆర్పీఎఫ్ జవాన్ తన భార్యను హతమార్చాడు.ఆ హత్య కేసులో భర్తను పోలీసులు అరెస్టుచేశారు. బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు శనివారం గజపతినగరం సర్కిల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. డీఎస్పీ కథనం మేరకు.. మండలంలోని బంగారమ్మపేటకు చెందిన తాడుతూరి అనూష, అలియాస్ తనూజకు అదే గ్రామానికి చెందిన సీఆర్పీఎఫ్‌లో విధులు నిర్వహిస్తున్న మక్కా జగదీష్‌తో నాలుగు నెలల కిందట వివాహం జరిగింది. తనూజతో జగ దీష్‌కు చదువుకున్న రోజుల్లో పరిచయం ఏర్పడింది. దీంతో వివాహం జరిగినా భార్యపట్ల అనుమానంతో ఉండేవాడు. ఆమెను హత్య చేసేందుకు యూట్యూబ్‌లో వీడియోలుచూసి పథకం పన్నాడు. ఈ నేపథ్యంలో పదిరోజులపాటు సెలవుపై ఇంటికి వచ్చాడు. బెంగళూరు వెళ్తామని చెప్పి తనతో రావాలని పేర్కొని విజయనగరం తీసుకువెళ్లి రెండురోజులు లాడ్జిలోఉంచాడు. ఈనెల 16న గ్రామంలో వారాల పండగ కావడంతో ఇద్దరూ గ్రామానికి వచ్చారు. గ్రామంలో భార్య ప్రవర్తనపై దృష్టిపెట్టాడు.ఆ రోజు రాత్రి ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో భార్యను ఇంటికి సమీపంలో గల పూరిపాకలో నైలాన్‌తాడుతో మెడకు ఉరివేసి హత్యచేశాడు. ఆనవాళ్లు దొరక్కుండా చేతికి బ్లౌజులు వేసుకొని మెడ వద్ద తాడు గాయాలు కనిపించకుండా రుద్దాడు. హత్యచేసిన తర్వాత భార్య అనూష సెల్‌ఫోన్ నుంచి ఆమె కుటుంబసభ్యులకు గ్రామానికి చెందిన రాజేష్ తనను మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడని, ఈ విషయం నా భర్తకు తెలిస్తే నేను ఉరివేసుకొని చనిపోతానని, నా భర్త మంచివాడని తనను బాగా చూసుకుంటున్నారని మెసెజ్‌పెట్టాడు.హత్య జరిగిన తరువాత తనూజ తండ్రి ప్రసాద్ అన్నవ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదుచేశాడు.ఈమేరకు దర్యాప్తులో భాగంగా ప్రసాద్‌కు తనూజకు సెల్‌ఫోన్‌లో ఎటువంటి మెసేజ్‌లులేవు. భార్య చనిపోయిన తర్వాత శవపంచనామ,అంత్యక్రియలకు భర్త జగదీష్ హాజరుకాలేదు. అలాగే జగదీష్ తల్లిదండ్రులను ప్రశ్నించినా జమ్ముకాశ్మీరులో ఉన్నాడని సమాధానం ఇచ్చారు.దీంతో అనుమానం రావడంతో రాజేష్ సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా పరిసర ప్రాంతాల్లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.సిబ్బంది సహాయంతో నిందితుడిని బూదేవిపేట గ్రామ సమీపంలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ ఎన్‌వీ ప్రభాకరరావు, ఎస్ఐ యు.మహేష్, సిబ్బంది రాంబాబు, మురళి కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించి కొద్ది రోజుల్లోనే ఛేదించారు.

## ధర్మవరంలో పెయింటర్ ఆత్మహత్య



అజయ్‌కుమార్ (ఫైల్)

**శృంగవరపుకోట రూరల్:** మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన పెయింటర్ పి.అజయ్‌కుమార్ (35) మద్యానికి బానిసై, చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. అజయ్‌కుమార్ పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిస కావడంతో పాటు పలువురు వద్ద అప్పులుచేశాడు.పలుమార్లు తాగొద్దని భార్య రమాదేవి మందలించేది. ఈనేపథ్యంలో శనివారం ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు.అజయ్‌కుమార్‌కు నాలుగు సంవత్సరాలు కుమార్తెఉంది. భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు హెచ్‌సీ ప్రసాద్ కేసు నమోదుచేశారు.

## నిచ్చెనపై నుంచి కింద పడి వ్యక్తి మృతి

**నెల్లిమర్ల:** మండలంలోని అల్తిపాలెంలో కేబుల్ పనిచేస్తున్న వ్యక్తి వడ్డాది ఉమామహేశ్వరరావు(42) నిచ్చెన పైనుంచి కిందకు జారి పడి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. నెల్లిమర్ల ఎస్ఐ డి.రామగణేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఒమ్మి గ్రామానికి చెందిన ఉమామహేశ్వరరావు దినచర్యలో భాగంగా శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఒమ్మిలో ఇంటి నుంచి బయలుదేరి పక్కనే ఉన్న అల్తిపాలెం గ్రామానికి వెళ్లాడు. స్తంభంపైకి ఎక్కేందుకు నిచ్చెన ద్వారా వెళ్లి వైర్లను టైట్ చేస్తుండగా అదుపు తప్పి కిందకు పడ్డాడు. దీంతో తల వెనుక భాగానికి తీవ్ర గాయమై ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడి భార్య రూపవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించారు.

## నాలుగు ఇసుక ట్రాక్టర్ల సీజ్

**రేగిడి:** బొడ్డవలస నాగావళి తీరంలో సంకిలి వద్ద శనివారం పోలీసులు, రెవెన్యూ అధికారులు నాలుగు ట్రాక్టర్లను సీజ్‌చేశారు.వాటిని పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.రేగిడి, బొడ్డవలససమీపంలో రక్షితబావుల వద్ద ఇసుకఅక్రమ తవ్వకాలపై తనిఖీచేస్తున్నట్లు తహసీల్దార్ రాములమ్మ, ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

## మా పాఠశాలను కాపాడండి

● కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సుంకరిపేట గ్రామస్థులు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సుంకరిపేట గ్రామస్థులు

**కలెక్టరేట్:** తమ పాఠశాల స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని విజయనగరం మండలం సుంకరిపేట గ్రామస్థులు శనివారం కలెక్టర్ నాగలక్ష్మికి ఫిర్యాదు చేశారు. పాఠశాలను కాపాడాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బోడసింగ్ శ్రీనివాస్, తదితరులు మాట్లాడుతూ.. 'గ్రామంలోని సర్వే నెంబర్ 195-5(ఏ)లోని ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని జిల్లా పరిషత్ పాఠశాల ఏర్పాటు కోసం 2001-02లో కేటాయించారు. ఇందులో రెండెకరాల్లో భవనాలు నిర్మించారు. మిగిలిన మూడు ఎకరాలు విద్యార్థుల ఆట స్థలం కోసం కేటాయించారు. అయితే గ్రామానికి చెందిన టి.సురేష్ అనే వ్యక్తిఈ స్థలాన్ని ఆక్రమించుకున్నాడని' తెలిపారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి మ్యూటేషన్ చేయించి తన తల్లి పేరున రికార్డులో మార్పు చేశాడని కలెక్టర్‌కు వివరించారు. ఇదేకాకుండా ల్యాండ్ కన్వర్షన్ కూడా జరిగిందని తెలిపారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

**విజయనగరం దాసన్నపేట:** రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పింఛనుదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు పెద్దింటి అప్పారావు తెలిపారు. శనివారం పెన్షనర్ల సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ సంఘం 1976 నుంచి పింఛనుదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. నూతన సంఘం పేరుతో వస్తున్న ప్రకటనలపై ఎవరూ స్పందించవద్దని కోరారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు సూర్యనారాయణ, కార్యదర్శి త్రినాథ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కాంట్రాక్టు సిబ్బంది ఆందోళన

**శృంగవరపుకోట:** స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో డిపో కాంట్రాక్టు సిబ్బంది ఆందోళనకుదిగారు. ఈ డిపోలో కాంట్రాక్టు పద్ధతిలో డి.నరేష్, పి.పోలినాయుడులు పని చేస్తున్నారు. వీరిని ఇటీవల అకారణంగా తొలగించారని ఆరోపిస్తున్నారు. దీనికి నిరసనగా ఈ ఆందోళన చేపట్టారు. తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. యాజమాన్యం అన్యాయంగా తొలగించడంపై ప్రశ్నిస్తే రెండు నెలల పాటు విజయనగరం డిపోలో పనిచేయాలని చెబుతున్నారన్నారు. వీరికి సీఐటీయూ నాయకులు మద్దతు పలికారు.

# గోవుల తరలింపుపై నిరసన

● సినీ నటి కరాటే కల్యాణి రోడ్డుపై బైఠాయింపు



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న కరాటే కల్యాణి

**కొత్తవలస:** గోశాలకని తరలిస్తున్న గోవులు ఎక్కడకు వెళుతున్నాయని సినీనటి కరాటే కల్యాణి నిలదీశారు.శనివారం మండలంలోని గనిశెట్టిపాలెం జంక్షన్ వద్ద రోడ్డుపై బైఠాయించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ కబేళాలకు తరలివెళ్తున్న గోవులను పట్టుకుని పోలీసులకు అప్పగిస్తుంటే ,వారు గోశాలలకు పంపిస్తున్నామని తనతోచెప్పి మళ్లి గోభక్షశాలలకు పంపిస్తున్నారని వాపోయారు. ఇంతకు ముందు పట్టుకుని అప్పగించిన గోవులు ఎక్కడ ఉన్నాయో చెప్పాలని నిలదీశారు.నక్కపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో గోవులను పట్టుకోగాఅవి ఇక్కడకు సంరక్షణ కోసం పంపించినట్టు పోలీసులు చెప్పారని ఇక్కడకు వచ్చిచూస్తే ఒక్క గోవు కూడా లేదని ప్రశ్నిం చారు. శనివారం 60 గోవులు ఉన్న లారీని గోశాలకు పంపిస్తున్నామని పేర్కొని తరలిస్తుండడాన్ని తెలుసుకున్న కరాటే కల్యాణి గనిశెట్టిపాలెం గోశాలకు వచ్చి పరిశీలించారు. గోవులు లేక పోవడంతో నిరసన తెలిపారు. కబేళాలను సీజ్ చేసేవరకు తాను కదిలేదని రోడ్డు మీద బైఠాయించారు. కొత్తూరు, గనిశెట్టిపాలెంలో, సబ్బవరం మండలం మొగిలిపురంవద్ద గల గోశాలలు నకిలీవని ఆరోపించారు. కబేళాలు నిర్వహిస్తున్న వారికి పోలీసులకు అవగాహనఉందని ఆరోపించారు. ఇప్పటివరకు ఈ గోశాలకు ఎన్ని గోవులు తరలించారు, వాటి రికార్డులు చూపించాలని డిమాండ్ చేశారు. తాను కేవలం గోవుల సంరక్షణ కోసమే హైదరాబాద్ నుంచి ఇక్కడకు వచ్చానని, తాను అప్పగించి గోవులు కనిపించక పోవడంతో అవి ఎక్కడకు పోయాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి

● రాజాం నియోజకవర్గ టీడీపీ నాయకులు ఏకగ్రీవంగా తీర్మానం

**రాజాం:** ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని నియోజకవర్గం టీడీపీ నాయకులు ఏకగ్రీవంగా తీర్మానించి అధిష్ఠానానికి పంపించారు. ఈ మేరకు రాజాంలో నియోజకవర్గ స్థాయి టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా బీసీ సెల్ పార్లమెంట్ అధ్యక్షుడు గురవాన నారాయణరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు టీడీపీలో ఉంటూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడమే కాకుండా సిద్ధాంతాలు, ఆశయాలకు తూట్లు పొడిచే విధంగా వైసీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్ గెలుపు కోసం పాటుపడిన వారిపై పార్టీ అధినేత క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మాజీ ఎమ్మెల్యే కిమిడి గణపతిరావు, మాజీ ఎంపీపీ కిమిడి రామకృష్ణంనాయుడు, రేగిడి సర్పంచ్ కిమిడి రవి, కిమిడి వినయ్‌కుమార్, శాసపు కేశవనాయుడు తదితరులు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయండని చెపుతున్న వీడియోలు ఉన్నాయని తెలిపారు. రాజాంలో టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్‌ను ఓడించేందుకు విశ్వ ప్రయత్నాలు చేసిన వీరిపై చర్యలు తీసుకోవాలని రాజాం పట్టణ, మండల, రేగిడి, వంగర మండలాల అధ్యక్షులు నంది సూర్యప్రకాష్‌రావు,సుమల వెంకట మన్మథరావు, కిమిడి అశోక్‌కుమార్, పిన్నింటి మోహన్‌రావుతోపాటు పలువురునాయకులు సంతకాలుచేసిన లేఖను సీఎం చంద్రబాబు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్ల శ్రీనివాసరావు, నారా లోకేష్‌కు పంపించినట్లు చెప్పారు.

## టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

**శృంగవరపుకోట రూరల్:** మండలంలోని కొత్తురుకు చెందిన టీడీపీ నాయకుడు, గ్రామకమిటీ అధ్యక్షుడు గోకేడా సత్యనారాయణ (47)శనివారం మృతి చెందారు. ఆయన గ్రామంలో పాలకేంద్రం కార్యదర్శిగా పనిచేశారు. సత్యనారాయణ మృతికి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారీ, టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శులు రాంప్రసాద్, ఇందుకూరి సుధారాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, పార్టీ మండల అధ్యక్ష,కార్యదర్శులు జీఎస్ నాయుడు,జుత్తాడ రామసత్యం తదితరులు సంతాపం తెలియజేశారు.

## యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

● ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



రామ్మోహన్‌నాయుడుతో మాట్లాడుతున్న కోళ్ల లలితకుమారి

**కొత్తవలస/ఎస్.కోట:** గిరిజన యూనివర్సిటీని రెల్లి రెవెన్యూ గ్రామంలో ఏర్పాటుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. శనివారం ఆమె అమరావతిలో శాసనసభ సమావేశాలకు హాజరైన సందర్భంగా అక్కడికి వచ్చిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం గిరిజన యూనివర్సిటీని కొత్తవలస మండలం అప్పన్నదొరపాలెంలో ఏర్పాటు చేసేందుకు 2015లో కేంద్ర ప్రభుత్వం అనమతి ఇచ్చిందన్నారు. 526 ఎకరాలను సేకరించి..సుమారు రూ.5 కోట్లతో తెలుగదేశం ప్రభుత్వం హయాంలోనే ప్రహరీ నిర్మించినట్టు తెలిపారు. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వం పార్వతీపురం మండలంలో వర్సిటీని ఏర్పాటు చేస్తామని చెప్పి ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. అప్పుడు సేకరించిన భూమి అలాగే ఉన్నందున గిరిజన యూనివర్సిటీని కొత్తవలస మండలంలోనే ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఆమెతో పాటు గొంప దుర్గా ఉమేష్, చీపురుపల్లి సాగర్ కుమార్, కె.విజయ్ కుమార్, మాకెన నవీన్‌పాత్రుడు, మాకెన సీతారామపాత్రుడు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సీఎం చంద్రబాబుకు కూడా ఇదే విషయమై విజ్ఞప్తి చేసినట్టు ఎమ్మెల్యే లలితకుమారి తెలిపారు.

## నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల విక్రయం

● ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికిరణ్ యాదవ్

**బొబ్బిలి:** బొబ్బిలి పట్టణంలోని పలు విద్యాసంస్థల్లో విద్యాహక్కు చట్టం నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలను విక్రయిస్తున్నారని ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికిరణ్‌యాదవ్ ఆరోపించారు. శనివారం బొబ్బిలిలో విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో ఓ స్కూల్‌లో అధికారులతో వెళ్లి తనిఖీలు చేయగా పాఠశాల పేరుమీద పుస్తకాలు విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. తమ సంఘం ఆందోళన మేరకు అధికారులు సోమవారం దర్యాప్తు నిర్వహిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. డిప్యూటీ డీఈకి ఫిర్యాదు చేశామని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాలలపై చర్యలుతీసుకుంటామని స్పష్టం చేశారని తెలిపారు.

## యాజమాన్యం మొండివైఖరి విడనాడాలి

● జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షుడు గాడి అప్పారావు



రిలే దీక్షలు చేస్తున్న కార్మికులు

**కొత్తవలస:** కార్మికుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం మొండి వైఖరిని విడనాడాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షుడు గాడి అప్పారావు కోరారు. జేఎస్ఎల్ కార్మికులు రెండో రోజు శనివారం రిలే నిరాహార దీక్షలను కొనసాగించారు. మూడు కార్మిక సంఘాలకు చెందిన కార్మికులు బర్ల అచ్చియ్యమ్మ, సింగంపల్లి నాయుడుబాబు, రాళ్లపల్లి సత్యనారాయణ, తమడపు రాము, గేదెల ఎర్నాయుడు, రొంగలి సన్యాసినాయుడు, బొబ్బర శ్రీను, బి.రామకృష్ణ, అక్కిరెడ్డి అప్పారావు, రొంగలి శ్రీనువాసరావు దీక్షలు చేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ కర్మాగారం పని చేసిన సమయంలో కార్మికులు యాజమాన్యానికి అన్ని విధాలా సహకారం అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు పిల్లా అప్పలరాజు, లగుడు వామాలు, బి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**విజయనగరం క్రైం:** మాదక ద్రవ్యాలు వల్ల యువత భవిష్యత్తు అంధకారం అవుతుందని, వాటికి దూరంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ వెంకటరావు కోరారు. శనివారం విజయనగరంలోని ఎంఆర్ కళాశాల, ఆదిత్య డిగ్రీ కళాశాలలో సీఐ వెంకటరావు ఆధ్వర్యంలో ఎస్ఐలు నరేష్, నవీన్ పడాల్ విద్యార్థులతో మాట్లాడారు. మత్తు కలిగించే గంజాయి, డ్రగ్స్, హెరాయిన్, గుట్కా, ఖైనీలు వినియోగించి జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు.మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రమాణం చేయించారు..

## జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలి

**విజయనగరం దాసన్నపేట:** జిల్లా అభివృద్ధి పథంలో నడిపించాలని టీడీపీ నాయకులు కోరారు.ఈ మేరకు రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావును శనివారం విజయవాడలోని ఆయన కార్యాలయంలో కలిశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్, గాడు అప్పారావు, రౌతు చంటి, ఈగల అజయ్, దత్తి సోమునాయుడు, కాళ్ల రఘు, రవి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి శ్రీనివాస్‌కు అభినందిస్తున్న టీడీపీ నాయకులు

## మొక్కల పెంపకంపై దృష్టి: ఏపీవో

**రామభద్రపురం:** ఉపాధి హామీ పథకం కింద ఈ సీజన్‌లో పెద్ద ఎత్తున మొక్కల పెంపకం చేపట్టాలని ఏపీవో గొలగాని త్రినాథరావు తెలిపారు. తారాపురంలో కాలువ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఏయే రకాల మొక్కలు అవసరమో ఇండెంట్ ఇవ్వాలని సూచించారు. హార్టికల్చర్ అభివృద్ధిలో భాగంగా గ్రామాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇందులో భాగంగా గట్టు వేయడం వంటి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు పనులు కల్పించడానికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. కాలువ పనులు, మస్తర్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీసీ శ్రీనివాసరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## మురుగుకాలువ ఏర్పాటుచేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

**రాజాం:** సారధి రహదారిలో మురుగుకాలువ ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచ్ టంకాల వెంకటేశం, పొట్నూరు వెంకటరమణ కోరారు. ఈమేరకు శనివారం రాజాం పురపాలక సంఘం కమిషనర్ జె.రామప్పల నాయుడుకు వినతిపత్రం అందజేశారు. సారధి వెళ్లే రహదారిలో పంట పొలంలోకి పురపాలక సంఘం మురుగు నీరు, చెత్తా చెదారం చేరడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.పంటలు పాడవుతున్నాయని, తక్షణమే మురుగు కాలువలు ఏర్పాటు చేసి న్యాయం చేయాలని కోరారు. పరిశీలించి రైతులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీఇచ్చారు.

## వారపు సంత వేలం వాయిదా

**కొత్తవలస:** జిల్లా పరిషత్ ఆధీనంలోనున్న కొత్తవలస వారపు సంతలో(మంగళవారం) ఆశీలు వసూలుకు సంబంధించిన వేలం పాటను డిప్యూటీ సీఈఓ రాజ్ కుమార్ వాయిదా వేశారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన వేలం పాటకు సంబంధించి ఇద్దరు మాత్రమే రూ.50 వేల చొప్పున డిపాజిట్ చేశారు. గత సంవత్సరం రూ.5 లక్షల 78 వేల 100కు పాడగా.. ఈ ఏడాది 10 శాతం పెంచి పాడాలని అధికారులు సూచించారు. వారపు సంత సరిగా జరగనందున అధికంగా పాడితే నష్టపోతామని పాటదారులు చెప్పడంతో వాయిదా వేశారు.

## సీబీఎం పాఠశాలను కాపాడండి

**బొబ్బిలి:** బొబ్బిలి పట్టణంలో చరిత్ర కలిగిన సీబీఎం బాలికల హైస్కూలుకు మనుగడలేకుండా చేయడం అన్యాయమని బాప్టిస్టు చర్చి సంఘం ప్రతినిధి సీహెచ్ డేవిడ్ అన్నారు. శనివారం బొబ్బిలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద, బడుగు వర్గాల ఆడపిల్లలకు విద్యాబుద్ధులు ప్రసాదించిన ఈ పాఠశాల గుర్తింపును మే నెలలో రెన్యువల్ చేయాల్సి ఉన్నప్పటికీ.. దీని బాధ్యతలు నిర్వహిస్తున్న వ్యక్తి అలా చేయ లేదన్నారు. పాఠశాలలో ఈ విద్యాసంవత్సరంలో ప్రవేశాలు కల్పించడం లేదన్నారు. పాఠశాలకు చెందిన అత్యంత విలువైన ఆస్తిని అన్యాక్రాంతం చేసే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయన్నారు. దీనిని ప్రభుత్వం అడ్డుకోవాలని, ఇందుకోసం ప్రత్యేకాధికారిని నియమించాలని ఆయన కోరారు. దీనిపై ఇటీవల ఎమ్మెల్యే బేబీనాయనకు వినతిపత్రం అందజేసినట్టు ఆయన తెలిపారు.

## సమయపాలన పాటించాలి

**రాజాం:** ఉపాధి వేతనదారులు సమయ పాలన పాటిస్తేనే కూలి గిట్టుబాటు అవుతుందని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. శనివారం గారాజుచీపురుపల్లిలో ఉపాధి పథకం పనులు, మస్తరు పుస్తకాలను పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడుతూ రోజుకు వేతనం రూ. 300 గిట్టుబాటు కావాలంటే పనిలోకి సమయానికి చేరుకోవాలనలన్నారు.

## మేట్లపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాలవలస గ్రామస్థులు

**కలెక్టరేట్:** దొంగ మస్తర్లు వేసి అక్రమాలకు పాల్పడిన ఉపాధి హామీ మేట్లపై చర్యలు తీసుకోవాలని గుర్ల మండలం పాలవలస గ్రామానికి చెందిన మాజీసర్పంచ్ సుంకరి పైడినాయుడు తోపాటు గ్రామస్థులు కోరారు. ఈమేరకు శనివారం కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. గతంలో క్షేత్ర సహాయకుడు గేదల సత్యనారాయణను విధుల నుంచి తొలగించారని, అప్పటి నుంచి గ్రామానికి చెందిన మేట్లు వేతనదారులతో పనులు చేయించారని తెలిపారు. అదే సమయంలో గ్రామం నుంచి వివిధ పనులు కోసం దూరం ప్రాంతాలకు వెళ్లిన వారికి దొంగ మస్తర్లు వేసి అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. వీటితో పాటు పలు అంశాలపై ఫిర్యాదుచేశారు. తక్షణమే విచారణ చేసి అక్రమాలకు పాల్పడిన మేట్లపై చర్యలు తీసుకోవాలని కలెక్టరును కోరారు.

## బాల్య వివాహాలపై అవగాహన అవసరం

**రామభద్రపురం:** గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలపై విస్తృతమైన అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.సూర్యకళ తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం కిశోర బాలికలకు సూచనలు, సలహాలు అందించారు. ముఖ్యంగా చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేయడం వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు. ఈ వయస్సులో ఎటువంటి ఆకర్షణలకు గురికావద్దని బాలికలకు తెలిపారు. 18 ఏళ్లు నిండిన తరువాత వివాహం చేసుకోవడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు ఎటువంటి సమస్యలు రాకుండా ఉంటాయని తెలిపారు. ర్యాగింగ్, సెల్‌ఫోను వినియోగం వల్ల కలిగే సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కామేశ్వరరావు, పీఈటీ శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు జి.లక్ష్మి, రాధ, మణి తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక చట్టాలు అమలుచేయాలి

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు

**బొబ్బిలి:** ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేసే టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందికి ఉద్యోగభద్రత కల్పించాలని, కార్మిక చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. శనివారం బొబ్బిలిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు ఉద్యోగులను తమ ఇష్టారాజ్యంగా తొలగిస్తున్నారని, దీంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు.ఉద్యోగులకు పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యగంధర్ పాల్గొన్నారు.

## మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

**వంగర:** మడ్డువలస గురుకులంలో ఆరు,తొమ్మిదో తరగతిలో ప్రవేశం కోసం మిగులు సీట్లు భర్తీకి దర ఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేరకు ఈనెల 25లోగా ఆధార్ కార్డుతో హాజరుకావాలని పేర్కొన్నారు. ముం దుగా రిజిస్ట్రేషన్ చేసిన అనంతరం 29నపరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పతిభ ఆధారంగా విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

## పెట్టుబడి సాయం జమ చేయాలి

● లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ

**విజయనగరం దాసన్నపేట:** రైతుల ఖాతాలో పెట్టుబడి సహాయం కింద రూ 20 వేలు జమ చేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు.ఈ మేరకు రూ 20.వేలు జమ చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి శనివారండ లేఖ రాశారు. ఈ సందర్భంగా విజయనగరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ గత ఖరీఫ్, రబీ సీజన్‌లో వర్షాభావంతో, డిసెంబరులో తుఫాన్ వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. ఈ అంశాన్ని దృష్టిలో వుంచుకుని సూపర్ సిక్స్‌లో హామీ ఇచ్చిన ప్రకారం రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందించి ఆదుకోవాలని కోరారు.సమావేశంలో పార్టీ నాయకులు రామచంద్రరాజు, నాగభూషణం పాల్గొన్నారు.

## ఆక్రమణల తొలగింపు



తోటపల్లి ప్రాంతంలో ఆక్రమణలు తొలగించిన దృశ్యం

**గరుగుబిల్లి:** తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయాల పరిధిలోని ఆక్రమణలను శనివారం తొలగించారు. గత కొద్ది రోజుల కిందట తోటపల్లికి చెందిన గణేష్‌రాజు, కుటుంబ సభ్యులు కల్యాణ కట్టకు ఆనుకుని ఉన్న కొంత ప్రాంతాన్ని ఆక్రమించి కంచెతో పాటు సిమెంటు స్తంభాలు ఏర్పాటు చేశారు. దేవస్థానానికి వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కోసం ఇక్కడ స్థలాన్ని ఆలయ అభివృద్ధి సేవా ట్రస్టు ప్రతినిధులు చదును చేయించారు. అయితే ఈ చదును చేసే ప్రాంతం తమకు చెందిందని గణేష్‌రాజు కంచె వేశారు. దీంతో సేవా ట్రస్టు ప్రతినిధులు డా.డి.పారినాయుడు, ఎం.పకీరునాయుడు, ఎ.కన్నయ్య, ఎం.వాసునాయుడు, ఎం.సీతంనాయుడుతో పాటు పలువురు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కె.జయ, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీల్దార్ స్పందించి.. సర్వే నిర్వహించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు మండల సర్వేయర్ బి.శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మండంగి కృష్ణ, వీఆర్వో తాత రవికుమార్, సర్వేయర్ రామ్‌మోహన్‌తో పాటు పలువురు ఈ స్థలాన్ని పరిశీలించారు. సర్వే నెంబరు 189-5లో సుమారు 93 సెంట్లు దేవస్థానానికి చెందిన స్థలంగా గుర్తించారు. ఆక్రమణ చేసిన స్థలం సుమారు 5 సెంట్లు ఉందని గుర్తించారు. తదుపరి ఆక్రమణదారులు ఏర్పాటు చేసిన కంచెను, స్తంభాలను తొలగించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఆడలి ఘాట్ వద్ద ఆటో బోల్తా



ప్రమాద దృశ్యం

**సీతంపేట:** గులుమూరు పంచాయతీ పరిధిలో ఉన్న ఆడలి వ్యూ పాయింట్‌ను సందర్శించి తిరుగు ప్రయాణంలో వస్తుండగా ఆడలి సమీపంలో ఉన్న ఘాట్ వద్ద పర్యాటకుల ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని మరో ఆటోలో శ్రీకాకుళం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. శనివారం మధ్యాహ్నం శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన పర్యాటకులు రెండు ఆటోల్లో ఆడలి వ్యూపాయింట్ సందర్శించడానికి వెళ్లారు. సందర్శించి తిరుగు ప్రయాణంలో ఘాట్ దిగుతుండగా ఆటోకు బ్రేకులు ఫెయిల్ అయి రోడ్డు పక్కన బోల్తా పడిపోయింది. వెంటనే మరో ఆటోలో వీరిని ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై సీతంపేట పోలీసులకు సమాచారం అందడంతో శ్రీకాకుళం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వివరాలు తెలుసుకోవడానికి వెళ్లారు.

## రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

**కురుపాం:** ఆటోబోల్తా పడిన ఘటనలో పలువురు గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గుమ్మలక్ష్మీపురం మండలం వనకాబడి, కుశ, చెంబుగూడా గ్రామానికి చెందిన 8 మంది వ్యక్తులు కొమరాడ మండలంలో జరిగిన వివాహానికి వెళ్లి ఆటోలో తిరిగి ఇంటికి బయలుదేరారు. ఒడిశా రాష్ట్రం సంపీ, దుర్గపాడు సమీపంలో ఆటో బోల్తా పడటంతో కుశ గ్రామానికి చెందిన హరీష్, వనకాబడికి చెందిన పువ్వల అనిల్, చెంబుగూడకు చెందిన మారుతీకి గాయాలయ్యాయి. స్థానికులు వారిని కురుపాం ఆసుపత్రికి తరలించగా.. ప్రథమ చికిత్స చేసి పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశారు.

## తోటపల్లి మాజీ సర్పంచ్ మృతి

**గరుగుబిల్లి:** మండలంలోని తోటపల్లి మాజీ సర్పంచ్ మార్కొండ సత్యంనాయుడు (85) శనివారం మృతి చెందారు. ఆయన 1968 నుంచి 1982 వరకు సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆ సమయంలో విజయనగరం జిల్లా ఏర్పాటుకు ప్రత్యేక కృషి చేశారు. తోటపల్లి శ్రీవెంకటేశ్వర, కోదండరామస్వామి ఆలయాలకు కొంతమేర భూమిని విరాళంగా అందించారు. ఆయన మృతి పట్ల జట్టు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు, మార్కొండ వాసుదేవనాయుడు, పకీరునాయుడు, ఆవాల కన్నయ్య, ఎంపీటీసీ సభ్యులు మరడాన సింహాచలం నాయుడు, ఎం.నూకంనాయుడు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

## భయాందోళనలో సుంకి వాసులు



సుంకిలో ధాన్యం నిల్వలను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు

**గరుగుబిల్లి:** మండలంలోని సుంకి గ్రామస్థులు ఏనుగుల సంచారంతో భయాందోళన చెందుతున్నారు. గత రెండు రోజులుగా పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు శుక్రవారం అర్ధరాత్రి గ్రామంలోకి రావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పగలు పంట పొలాల్లో, రాత్రి సమయంలో గ్రామాల్లోకి చొరబడటంతో ఏ నిమిషం ఏం జరుగుతుందోనన్న ఆందోళనలో ఉన్నారు. గ్రామానికి చెందిన పెనుగంటి గౌరునాయుడుకు చెందిన ధాన్యం నిల్వలను ధ్వంసం చేశాయి. అలాగే నివాసాలకు ఆనుకుని ఉన్న కొబ్బరి, పండ్ల మొక్కలను ధ్వంసం చేశాయి. గత కొన్నాళ్లుగా ఈ ప్రాంతాల్లోనే సంచరిస్తూ పండిన పంటలను పనికి రాని విధంగా చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్‌కు సంబంధించి వరి నారుమళ్లను వేసుకోలేని స్థితిలో ఉన్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అటవీశాఖ అధికారులు ఏనుగుల గుంపును సురక్షిత ప్రాంతానికి తరలించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**గరుగుబిల్లి:** పంచాయతీల పరిధిలో వ్యాధులు ఆశించకుండా ఉండేలా పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో పైల సూర్యనారాయణ సూచించారు. శనివారం స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల పరిధిలో పారిశుధ్య నిర్వహణపై అలసత్వం వహించకూడదన్నారు. క్లోరినేషన్ చర్యలు చేపట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు.

**త్వరలో ఉపాధి సామాజిక తనిఖీలు**

మండలంలోని 25 పంచాయతీల్లో ఉపాధి హామీ సామాజిక తనిఖీలు నిర్వహించనున్నారని, 17వ విడతకు సంబంధించి పనుల పరిశీలనకు సిబ్బంది పంచాయతీలకు రానున్నారని ఎంపీడీవో తెలిపారు. మండలానికి సంబంధించి సుమారు 20 కోట్లుకు పైగా వ్యయం జరిగిందని, పరిశీలనకు వచ్చే సిబ్బందికి సహకరించాలని కోరారు. ఉపాధితో పాటు సామాజిక పింఛన్లు పరిశీలన ఉంటుందని తెలిపారు. అక్రమాలకు తావులేకుండా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావు, ఏపీవో ఎం.గౌరీనాథ్, ఎస్ఆర్‌పీ బి.దాసుతో పాటు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, డీఆర్‌పీలు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## సేంద్రియ సేద్యం.. పర్యావరణ హితం

**సాలూరు రూరల్:** సేంద్రియ పద్ధతుల్లో సాగు చేయడం వల్ల పర్యావరణానికి మేలు చేకూరుతుందని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఐఎఫ్ఎస్ (ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టం) ఏఈవో ఎం. నాగేశ్వరరావు తెలిపారు. ఈ విశ్వవిద్యాలయం ఐఎఫ్ఎస్ కోసం సాలూరు మండలంలో పలు గిరిజన గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుంది. ఈ పథకంలో భాగంగా శనివారం ఆయా గ్రామాల్లో రైతులకు కూరగాయల విత్తనాలు, వేప నూనె తదితర వాటిని ఉచితంగా పంపిణీ చేశారు. సేంద్రియ సాగు పంటలకు అధిక డిమాండ్ ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడంగివలస తదితర గ్రామాల గిరిజన రైతులు పాల్గొన్నారు.

## వైభవంగా రామ మందిర వార్షికోత్సవం

**సాలూరు రూరల్:** కొత్తవలస గ్రామంలో నిర్మించిన రామ మందిర ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా సీతారాములకు ప్రత్యేక పూజలను చేశారు. ప్రసాద వితరణ చేశారు.

## వాచ్‌మన్‌కు ఆర్థికసాయం

**భామిని:** మండల కేంద్రంలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో వాచ్‌మన్‌గా పని చేస్తున్న లిమ్మల మనోహర్‌కు శనివారం పాఠశాల సిబ్బంది ఆర్థిక సాయం అందించారు. గత పదేళ్లుగా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ప్రభుత్వపరంగా ఎటువంటి ఆర్థిక సాయం అందకపోవడంతో ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది, ఉపాధ్యాయులు రూ.1.20లక్షలను ప్రిన్సిపాల్ శివకుమార్ ద్వారా మనోహర్‌కు అందించారు.

# నిల్వ నీటిలో చెత్త పోగులు

- తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్న వైనం
- ఇది మక్కువలోని కార్యాలయాలకు వెళ్లే రహదారి పరిస్థితి

**మక్కువ:** వెంగళరాయ సాగర్ నుంచి వచ్చే సాగునీరు మక్కువ మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో రోజుల తరబడి నిల్వ ఉంటోంది. ఆ నీరు అక్కడ నుంచి చప్టా ద్వారా భైరిసాగరం చెరువుకు వెళ్లాల్సి ఉంది. కానీ స్థానిక బీసీ కాలనీ వాసులు రోడ్డు పక్కనున్న ఆ నీటిలోనే చెత్తా చెదారాలను పారవేయడంతో నీరంతా స్తంభించిపోయింది. బయటకు వెళ్లే మార్గం మూసుకుపోవడంతో రోజుల తరబడి అక్కడే నిల్వ ఉంటోంది. ఆ నీటిలో చెత్తాచెదారాలు కలవడంతో మరింత దుర్గంధ భరితంగా మారింది. ఈ రోడ్డు గుండానే మండల ప్రజాపరిషత్, తహసీల్దార్, వెలుగు, ఎమ్మార్సీ కార్యాలయాలకు వెళ్లాల్సి ఉంది. అయితే ఈ రహదారి పక్కన చెత్తాచెదారాలు, వ్యర్థాలు పేరుకుపోవడంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వెళ్లే ప్రజలు ముక్కుమూసుకుని వెళ్లాల్సి వస్తోంది. చెత్తా చెదారాల కారణంగా పందులు కూడా స్వైర విహారం చేస్తున్నాయి. వర్షా కాలం ప్రారంభమైన నేపథ్యంలో దోమల సంఖ్య పెరిగి, సీజనల్ వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే అధికారులు ఎప్పటికప్పుడు చెత్త తొలగిస్తున్నప్పటికీ మళ్లీ యధావిధిగానే పరిస్థితి తయారవుతోంది. సంబంధిత అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పేరుకుపోయిన చెత్త

## బాధ్యతగా ఉండాలి



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

**పార్వతీపురంటౌన్:** వర్షాకాలం దృష్ట్యా జూలై 1వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు కల్పించే అవగాహన కార్యక్రమ ప్రచారంలో ప్రతిఒక్కరూ బాధ్యతగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు సచివాలయ అధికారులను హెచ్చరించారు. ఈ మేరకు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా 30 వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని, దోమల నివారణకు యాంటీ లార్వా స్ప్రేయింగ్‌తో పాటు పరిసరాల శుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించి ఎప్పటికప్పుడు ప్రత్యేక పర్యవేక్షణ అవసరమన్నారు.

## చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి




మాట్లాడుతున్న డీఎంవో జగన్మోహన్‌రావు

**పార్వతీపురంటౌన్:** చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహన్‌రావు అన్నారు. పట్టణంలోని ఏడో వార్డులోగల అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు జ్వరాలు వస్తే వెంటనే దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్సను అందించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ దోమలు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జ్వర లక్షణాలను గుర్తిస్తే వెంటనే జిల్లా ఆసుపత్రిలో నిర్ధారణ కేంద్రంలో పరీక్షలు నిర్వహించాలన్నారు. కాచి చల్లార్చిన నీటితో పాటు వేడి ఆహార పదార్థాలు పిల్లలకు అందేలా చూసుకోవాల్సిన బాధ్యత మీదేనని అన్నారు. ఆరోగ్య సిబ్బంది.. అంగన్‌వాడీ పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు.

## ఉద్యానంతోనే ఉజ్వల భవిష్యత్

- ఉద్యాన విశ్వ విద్యాలయ ఉప కులపతి డాక్టర్ జానకీరామ్



లోగోను ఆవిష్కరిస్తున్న డాక్టర్ జానకీరామ్

**గరుగుబిల్లి:** ఉద్యానవన కోర్సులతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయ ఉప కులపతి (వెంకట్రామన్నగూడెం) డాక్టర్ తోలేటి జానకీరామ్ అన్నారు. శనివారం సాయంత్రం ఉల్లిభద్ర సమీపంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల మొదటి వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశానికి కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బి.ప్రసన్నకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శాస్త్రానికి దీటుగా ఉద్యాన కోర్సులు అందిస్తున్నామని చెప్పారు. రైతులకు నూతన వంగడాలను అందించే దిశలో ప్రయోగాలు జరుగుతున్నాయని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఉద్యాన పంటలకే ఇస్తుందన్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సాంస్కృతిక, ఆటల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కళాశాల లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది డాక్టర్ నరసింహమూర్తి, రాజ్యలక్ష్మి, ఓఎస్‌పి డాక్టర్ కె.గీతాంజలి, అనిత, బిందుమాధవి, చైతన్య రేఖ, ప్రదీప్, సుజాత, ఝాన్సీ, రామారావు, కిరణ్‌కుమార్‌తో పాటు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షాలు చూసి మెట్ట పంటలు వేయండి



శివరాంపురంలో మొలకలు పరిశీలిస్తున్న ఏవో అనురాధ పండా

**సాలూరు రూరల్:** వర్షాలను చూసుకుని సరైన సమయంలో మెట్ట పంటల సాగుకు రైతులు ఉపక్రమించాలని మండల వ్యవసాయాధికారి అనురాధ పండా సూచించారు. శివరాంపురం గ్రామంలో ఆమె శనివారం పర్యటించారు. పత్తి, మొక్కజొన్న పంటల మొలక శాతాలను పరిశీలించారు. జూన్ మూడో వారం అనంతరం వర్షాల ఏ విధంగా కురుస్తున్నాయో స్పష్టత వచ్చిన తర్వాత మెట్ట పంటలను వేస్తే మంచిదన్నారు. ఒక వేళ విత్తనాలు వేసిన తర్వాత వర్షాలు సకాలంలో కురవకుంటే మొలక సమస్య వస్తుందని చెప్పారు. గత నెలలో వేసిన పత్తి విత్తనాల్లో పలు చోట్ల వర్షాల లేమి కారణంగా మొలక రాలేదన్నారు. జూన్ రెండో వారంలో వేసిన విత్తనాలు మొలకలొచ్చాయన్నారు. అధిక ఉష్ణోగ్రత వల్ల నాటిన విత్తనాలు జీవశక్తి కోల్పోయి మొలకలు రాలేదని వివరించారు. మొలకలు రాని ఖాళీల్లో మళ్లీ విత్తనాలు వేసి మొక్కల సాంద్రత సరిపోయేలా చూసుకోవాలని సూచించారు. ఈనెల 15 తర్వాత నాటిన విత్తనాలు మొలకలు రావడంతో పాటు వర్షాలు వల్ల పంటలు బాగున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఏఏ వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

## అయ్యన్నపాత్రుడికి విజయచంద్ర అభినందన



స్పీకర్ అయ్యన్నపాత్రుడితో ఎమ్మెల్యే విజయచంద్ర

**పార్వతీపురం, ఆంధ్రజ్యోతి:** శాసన సభకు కొత్తగా స్పీకర్‌గా ఎన్నికైన చింతకాయల అయ్యన్నపాత్రుడిని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అభినందించారు. ఆయన శనివారం స్థానిక విలేకర్లతో ఫోన్‌లో మాట్లాడారు. పార్వతీపురం నియోజకవర్గం అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని తనకు అయ్యన్నపాత్రుడు సూచించినట్టు చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు హామీనిచ్చినట్టు ఎమ్మెల్యే చెప్పారు.

## మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన జయకృష్ణ



మంత్రి రవీంద్రకు సత్కరిస్తున్న దృశ్యం

**పాలకొండ:** రాష్ట్ర అబ్కారీ శాఖా మంత్రి కొల్లు రవీంద్రను పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మర్యాదపూర్వకంగా విజయవాడలో కలిశారు. మంత్రికి దుశ్శాలువాతో సత్కరించారు. ఆయన వెంట తోటపల్లి మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగ తదితరులు ఉన్నారు.

## ఊరటనిచ్చిన వర్షం



భామినిలో కురుస్తున్న వర్షం

**భామిని:** గత కొన్ని రోజులు గా భానుడి భగభగతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజలు శనివారం సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. వరి, పత్తి, విత్తనాలు జల్లిన రైతులు హర్షం వ్యక్తం చేశారు. సతివాడ, ఘనసర, బాలేరు, భామిని పరిధిలోని కొద్దిపాటి వర్షం కురిసింది.

# నీటి పథకాలు నిరుపయోగం

- అడుగంటిన జలాలు
- గిరిజనులకు తప్పని కష్టాలు

**కొమరాడ:** గిరిజన గూడేలలో మంచినీటి మినీ పథకాలు నిర్వహణ లోపంతో పాటు భూగర్భ జలాలు అడుగంటడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెదశాఖ పంచాయతీ జల గ్రామంలో మినీ మంచినీటి పథకాన్ని నిర్మించారు. ఆ పథకం కోసం ఏర్పాటు చేసిన టబ్బులో నీరు అడుగంటడంతో మంచినీటి పథకం సక్రమంగా పనిచేయడం లేదని గిరిజనులు వాపోతున్నారు. ఆ టబ్బులో కూడా ఉన్న నీటిలో చెత్తా చెదారంతో పాటు నాచు చేరడంతో వినియోగించలేకపోతున్నామని చెబుతున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన మంచినీటి బోరుబావి నుంచి కూడా బురద నీరు వస్తున్నట్లు సీపీఎం నాయకులు కె.సాంబమూర్తి తెలిపారు. ఈ సమస్యలను కొమరాడ మండల నీటి సరఫరా విభాగం ఏఈ నవీన్‌కుమార్ వద్ద ప్రస్తావించగా సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులను పంపించి అక్కడి పరిస్థితిని తెలుసుకొని గిరిజనులకు తాగునీరందించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు.



మినీ మంచినీటి పథకం ముందు నిరసన తెలుపుతున్న గిరిజనులు (ఫైల్)

## మొక్కులు తీర్చుకున్న మహిళలు

**కొమరాడ:** రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా, కురుపాం నియోజకవర్గానికి తోయక జగదీశ్వరి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో మాదలంగి గ్రామంలో ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయంలో శనివారం స్థానిక టీడీపీ నాయకులు 116 కొబ్బరికాయలను కొట్టారు. కురుపాం నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు ఎస్.పావని, ఉపాధ్యక్షురాలు వి.లావణ్యలత, కార్యదర్శి వి.భారతమ్మ కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల కన్వీనర్ ఉదయశేఖర్ పాత్రుడు ఆధ్వర్యంలో నిర్వహించారు.



కొబ్బరికాయలు కొడుతున్న మహిళలు

## క్లుప్తంగా..

**కార్యకర్తలకు అండగా ఉంటా**

**గరుగుబిల్లి:** తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని రాష్ట్ర గనులు, భూగర్భ, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లి రవీంద్ర హామీ ఇచ్చారని అరకు తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ ఛైర్మన్ బూరాడ రామ్‌మోహన్‌రావు తెలిపారు. శనివారం ఆయన అమరావతిలో నూతనంగా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రవీంద్రను అభినందించారు. మన్యం జిల్లా పరిధిలోని ప్రధాన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు.

**ఆర్చరీ అకాడమీ ఏర్పాటు చేయాలి**

**గుమ్మలక్ష్మీపురం:** మండల కేంద్రంలోని మినీ స్టేడియం ఆవరణలో ఆర్చరీ అకాడమీ ఏర్పాటు చేయాలని గిరిజన ఆర్చరీ క్రీడాకారులు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో పలువురు గిరిజన యువకులు ఆర్చరీ క్రీడపై ఆసక్తి చూపుతున్నారని, వీరిని మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి ఆర్చరీ అకాడమీ ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్చరీ క్రీడాకారులకు తగిన శిక్షణ అందిస్తే జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా రాణిస్తారన్నారు.

**జగన్నాథస్వామికి ప్రత్యేక పూజలు**

**పార్వతీపురంటౌన్:** వచ్చేనెలలో జరగనున్న రథయాత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని దంగిడి వీధిలోగల శ్రీజగన్నాథస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్, టీడీపీ నాయకుడు బి.జయప్రకాష్ నారాయణ, కౌన్సిలర్ కె.నారాయణరావు, కమిటీ సభ్యులు ఈ పూజల్లో పాల్గొన్నారు. ఆదివారం నుంచి జగన్నాథస్వామి ఉత్సవాలు ప్రారంభం అవుతున్న పట్టణ గ్రూపు దేవాలయాల ఈవో ప్రసాదు తెలిపారు.

**అంగన్‌వాడీల్లో ఆట పాటలతో విద్య**

**గరుగుబిల్లి:** అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆట పాటల ద్వారా విద్యను నేర్పిస్తున్నామని కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని రావివలస, పెదగుడబ సెక్టార్ల సూపర్‌వైజర్లు అరుణకుమారి, రౌతు లక్ష్మి తెలిపారు. శనివారం రావివలస గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో మూడేళ్లు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఆడపిల్లల భవిష్యత్‌పై కళాజాతా**

**జియ్యమ్మవలస:** ఆడపిల్లల భవిష్యత్ బంగారు బాటలో నడిపించే బాధ్యత తల్లిదండ్రులదేనని ఐసీడీఎస్ కురుపాం ప్రాజెక్టు అధికారిణి కె.విజయగౌరి అన్నారు. శనివారం ఆమె పర్యవేక్షణలో డంగభద్ర, జియ్యమ్మవలస, తుంబలి, చినమేరంగి, రావినాయుడువలస, కన్నపుదొరవలస గ్రామాల్లో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంపై కళా జాతా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ పర్యవేక్షకులు విజయగౌరి, భవాని, శ్రావణి, జానకి, ఎన్.గౌరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పిల్లలు బడిలో ఉండాలి**

**గుమ్మలక్ష్మీపురం:** బడిఈడు పిల్లలు అంతా పాఠశాలలోనే ఉండాలని, దీనికి ఉపాధ్యాయుందరూ కృషి చేయాలని ఎంఈవో చంద్రశేఖర్, ఏటీడబ్ల్యూవో సురేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక ఏపీ గిరిజన గురుకుల (పీటీజీ) బాలికల పాఠశాలలో కొమరాడ, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన అన్ని ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. 14 సంవత్సరాల వయస్సు లోపు పిల్లలు బయట పని చేయకుండా చూడాలని.. పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు.

**మురుగు కాలువలు శుభ్రం చేయండి**

**వీరఘట్టం:** స్థానిక అంబేద్కర్ జంక్షన్ నుంచి బార్నాలవీధిలో మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. కాలువలు పూడుకుపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. వ్యాధుల సీజన్ కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై పంచాయతీ ఈవో పి.రాముని సంప్రదించగా పరిశీలించి మురుగు కాలువల్లోని చెత్తను తొలగిస్తామని తెలిపారు.

**జలజీవన్ మిషన్ పనుల పరిశీలన**

**కొమరాడ:** మండలంలోని 13 గ్రామాల్లో ఇంటింటికి కుళాయి ఇచ్చే జల జీవన్ మిషన్ పనులను గ్రామీణ నీటి సరఫరా విభాగం, కురుపాం డీఈ నాగేశ్వరరావు పరిశీలించారు. శనివారం సీతమాంబపురం, కొత్తవలస, పెదఖేర్జిల, రేగులపాడు, పూర్ణపాడు గ్రామాల్లో పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 13 గ్రామాల్లో జల జీవన్ మిషన్ ద్వారా ఓహెచ్ఆర్ఎస్ఆర్ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ఏఈ నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**బాధ్యతతో పనిచేయాలి**

**జియ్యమ్మవలస:** పంచాయతీల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించే బాధ్యత కార్యదర్శులదేనని ఎంపీపీ బొంగు సురేష్ అన్నారు. శనివారం ఆయన ఎంపీడీవో శ్రీనివాసరావుతో కలిసి పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీలతో ప్రమేయం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాల్సిందేనన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ నరేష్ తదితరులు పాల్గొన్నారు.